# పెళ్లిరోజు

"ఓ అందమైన బావా... ఆవుపాల కోవా...."

పాత సినిమా పాట కొత్త తాళంలో వినిపించింది. గార్దభరాగం విన్న గంధర్వుడిలా బేజారైపోయాడు రాజశేఖర్. బంగారం లాంటి సింగారం పాటను పట్టపగలు ఖూనీ చేస్తుందెవరూ... ఎవరూ ?" కేకలేశాడు.

ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్ మీద పదిరోజుల క్రితమే వచ్చి జాయినైన రాజశేఖర్‌కు సహోద్యోగులతో పూర్తి సాన్నిహిత్యమేర్పడలేదింకా.

"రాజశేఖరా నీపై మోజుతీరలేదురా..." మరో పాతపాట. అదే ఆడగొంతు, కళ్ళు మూసి తెరిచే లోగా ఓ పల్లెపడుచు రాజశేఖర్ ముందు ప్రత్యక్షమైంది. అతణ్ణి ఆపాదమస్తకం పరిశీలించి పళ్ళికిలించింది. తైల సంస్కారం లేని తలవెంట్రుకలు ఫానుగాలిలో తైతక్కలాడు తున్నాయి. మొహం నిండా పసుపు, కళ్ళనిండా డబుల్ కోటింగ్ కాటుక, పెదాలమీద భరతనాట్యం చేస్తున్న ముత్యాల ముక్కు పోగు... ముసి ముసి నవ్వులతో వచ్చి ఎదురు కుర్చీలో కూచుంది. గొంతు సవరించుకుని మరో పాట ఎత్తుకోబోయింది.

రాజశేఖర్‌కు పచ్చి మిరపకాయ పంటికిందికొచ్చి నట్లైంది. "ఎవర్నువ్వు" గర్జించాడు. చిర్రుబుర్రు లాడాడు. ఫైలును టేబుల్ కేసి కొట్టాడు. గర్జన గురించి తర్జనభర్జనలు మొదలైనాయి గాని ఆ శాల్తీ మాత్రం ఆవగింజంత గూడా బెదరలేదు.

"బాలను నేనూ, ఓపగలేనూ..." గొల్లున నవ్వేసి భళ్ళున మరో పాటందుకుంది. ఆఫీసు స్టాఫంతా తర్జనభర్జనలాపి వింతగా చూస్తున్నారు.

"అమ్మోయ్... మా ఆఫీసర్ మాయదారి మల్లిగాడనుకోలేదే !" పక్కనున్న టైపిస్టు ఊర్మిళ చెవిలో ఊదింది స్టెనో.

"పెళ్ళయాక గూడా చిల్లర బుద్ధులు పోలేదన్న మాటా" లోపల అనేసింది ఊర్మిళ.

"చిన్నిల్లూ, పెద్దిల్లూ ఈ రోజుల్లో ఫేషనై పోయిందేమో !" యాభై దాటిన గుమాస్తా యాదగిరి బేజారైపోతున్నాడు.

తలనరికి మొలకేసినట్టనిపించింది రాజశేఖర్‌కు.

"నువ్వు ముందు కుర్చీలోంచి లే" హూంకరించాడు.

"గదేంది బావా !" మూతి మూడు వంకర్లు తిప్పిందా పడుచు. ప్రేమన్నావు పెండ్లన్నావు. గన్ని సుద్దులు చెప్తివి. ఇప్పుడేమో... ఇ... ప్పుడిట్లా..." బోర్‌మంది. తలనీలాలు కళ్ళమీద తచ్చాడు తున్నాయి. "నువ్వు శ్రీరామచంద్రుడవని వనుకున్నా బావా..." గొంతు బొంగురుబోయింది.

రాజశేఖర్‌కు వళ్ళు మండింది.

"ఆహాహా ! బయలు దేరిందండి సీతాదేవి. లే బయటికి నడూ !" పళ్ళు పటపటలాడాయి. రూళ్ళకర్ర గాల్లో ఆడించాడు. పల్లె పడుచు కళ్ళు అరచేతు లంతైనై. స్ప్రింగ్‌లా తలాడించి పిడికిల్తో టేబుల్ మీద గుద్దేసింది.

"అగ్గో... నా పేరు నీకు బాగా గుర్తుంది. లేకపోతే పరేషనయేదాన్ని. అత్తకూతర్నని అంతా దోచుకున్నావు. మూడు నెల్లల్ల మూడుముళ్లేస్తనని తోకముడుస్తవా. పా. మనిల్లు చూపించు బావా !" రుసరుసలాడుతూ లేచి నుంచుంది.

"ఇల్లా !" హతాశుడై నోరెళ్లబెట్టాడు.

పదిమందిలో పరువు పంచనామా ఐపోతుంది. సబార్డినేట్స్ దృష్టిలో తనో గడ్డిపోచై పోతున్నాడు. ఏం చెయ్యాలో అర్థం గాలేదు.

"ఔను మల్ల. నీ ఇల్లే నా ఇల్లు. మీరే చెప్పండ్రి సారూ !" ఆఫీసు స్టాఫు వైపు తిరిగింది. "మొగుడూ పెండ్లాలకు అలగ్ అలగ్ ఇండ్లుంటయా ?"

"ఉండవుండవు. ఆలూ మొగలది ఒకే ఇల్లు ఒకే మాట, ఒకే పాట... తలపండిన యూడీసీ సంసార సూత్రాలను అరటిపండొలిచినట్టు చెప్పేశాడు.

రెచ్చిపోతే చిచ్చు రగిలి పరువూ మర్యాదలు దగ్ధమై పోయేట్టున్నాయి. నిదానమే ప్రధానము. సంయమనమే శరణ్యము.

"చూడు సీతా ! నువ్వెరివో నాకేమీ తెలీదు. నాకు పెళ్ళై సరిగ్గా సంవత్సరమైంది. ఈ రోజు నా పెళ్ళిరోజు. సాయంత్రం పెళ్ళాంతో సిన్మాకెళ్ళాలి. దయచేసి..." మాట పూర్తి కాలేదింకా.

"వామ్మో వామ్మో" గుండెలు బాదుకుంది. "నీకు పెండ్లైపోయిందా ! మరి నా సంగతేందంట? నువ్వింత మోసగానివని తెల్వదు బావా. ఎంత పనైందిరా దేవుడా" లబోదిబోమంది. ముక్కునూ, మొహాన్ని కొంగుతో తుడుచుకుంటూ రసాభాసకెత్తుకుంది.

"మీ జర్నల్ మ్యానేజరెక్కడుంటారమ్మా !" స్టెనో నడిగింది.

"ఆఁ... జనరల్ మానేజరా ! రాజశేఖర్ గుండెలో రాజధాని ఎక్స్‌ప్రెస్ పరుగెత్తింది. ఈ విషయం జీఎం దృష్టికెళ్తే ముందు మిస్‌కాండక్ట్ పేరుతో సస్పెండు చేస్తాడు. తన కోపమె తన శత్రువు తన శాంతమె తనకు రక్ష అన్నారు గదా. ఉపాయంతో అపాయం నుండి బయటపడాలి. కడుపులోని పొంగునంతా కంఠంలో బందీచేశాడు. పెదాల మీద బలవంతపు చిరునవ్వు మెరిసింది.

"సీతా నువ్వు మేనమరదలివి గదాని- పరాచికాలాడుతున్నావు గదూ ! కాస్సేపు నేనూ తమాషా చేశానంతే. పద. ముందు మనింటి కెల్దాం పద." అంటూ సూటుకేసందుకున్నాడు. సీత గలగలా నవ్వింది.

"చూశిండ్రా మా బావంటే బంగారుకొండ" తన కుడిచేతిని తానే ముద్దాడుకుంటూ రాజశేఖర్ వెంట గజ్జెలగుర్రంలా పరుగెత్తింది.

కామెడీ సినిమా ట్రాజెడీగా ముగిసినట్టు ఆఫీసు స్టాపు మొహాలు చూసుకున్నారు.

తలుపు తీయగానే జానకి కళ్ళు తళుక్కుమన్నాయి. జడలోని మల్లెలు నవ్వులు రువ్వాయి. పెళ్ళిరోజు సరదాగా గడపాలని భర్త ముందే వచ్చాడని ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వు సూర్యోదయంలా మెరిసింది.

ఇదేం విచిత్రం ! ఈమె ఈయనగారి ప్రియురాలా ? కాబోయే ఇల్లాలా ? జానక్కి మతిపోయినంత పనైంది.

"ఇదెవతండీ ?" ఉరిమింది.

సింహం లాంటి రాజశేఖర్ చిట్టెలుకయాడు.

"ఏమో జానకీ ! బావా బావా అంటూ నావెంట పడింది దెయ్యం. పేరు సీత. పీతలాగా నాగొంతు పట్టుకుంది. ఆఫీసులో హంగామా చేస్తుంటే భరించలేక ఇంటికి తీసుకొచ్చాను. నిజాయితీ నిరూపించుకునే ప్రయత్నం తప్పని సరైంది.

సీత మూతి, చేతులూ తిప్పుతూ "గిప్పుడు గూడా ఆశికాలెందుగ్గానీ ఈ అగ్గిమీది గుగ్గిలాన్ని ముందు మెడబట్టి గెంటెయ్" రెండు కాళ్ళను సోఫాలోకి మలుచుకుంది.

జానక్కి అగాధంలో పడిపోతున్నట్టనిపించింది. మరోవైపు ఆవేశం కట్టలు తెంచు కుంటూంది. ముక్కుపుటాలు ఎగిరి పడుతన్నై.

"ఐతే మీరు నా కొంపముంచేశారన్నమాటా." బాధానంతా పెదాల వెనక దాచేసి భర్తను చెయ్యిబట్టి నిలదీసింది.

"అయ్యయ్యో ! అదేం కాదు జానకీ" రాజశేఖర్ తలబాదుకున్నాడు. "ఈ పల్లెటూరు బైతు ఎవరో నాకు తెలీదు. నన్ను నమ్ము. నీ మీద ఒట్టు. మనకు పుట్టబోయే బిడ్డమీద ఒట్టు". జానకి తలమీద చెయ్యుంచాడు.

సీత ఒక్కదూకు దూకి నుంచుంది. చెమటకు కరిగిన రూపాయి కాసంత ఎర్ర కుంకుమ బొట్టు పచ్చని మొహమ్మీద కాషాయ రేఖలు గీస్తోంది. కొంగును నడుముకు బిగించి "వామ్మో వామ్మో ఇది నీ పెండ్లామా" గుండెలు బాదుకుంది. "ఓరిదేవుడో ! నా బావ నాకే సొంతమనుకుంటే గిదెవతో నా కంటే ముందే పెండ్లామై పోయిందట్రా భగవంతుడా ! అయ్యో అయ్యయ్యో " అరుపులు పెడబొబ్బలు అందుకుంది.

"ఇగ్గో జానకమ్మా !" సీత జానకి కళ్ళు అద్దింది. "నువ్వేద్వకు మా బావ మాయల మారాటోడు. నేను పుట్టంగనే ఇతని పెండ్లామన్నరట. గట్లనే పెరిగినం. గట్టిగ ప్రేమించుకున్నం. గుడ్డిగ ఒకటై పోయినం. నా బావ మనసు నవనీతమనుకున్నా. గిట్ల ఉజ్జోగం దొరుకంగనే ఉడాయిస్తడనుకోలేదు." తానూ కళ్ళద్దుకుంది.

రాజశేఖరానికి ఏం చెయ్యాలో పాలుపోక జుట్టు పీక్కున్నాడు.

"ఇదంతా కట్టుకథ జానకీ !" అంటుంటే ఊట చెలిమిలో నీటిపొంగులా ఏడుపు తోసుకొస్తుంది.

ఏది కట్టుకథ బావా ?" సీత గయ్‌మంది. ఆమెను పెండ్లాడిందా ? నన్ను పెండ్లాడ్తా నన్నదా ? ఈ మాయదారి మొగోళ్ళను నమ్మొద్దు జానకమ్మా" రాగాలు దీసింది.

"హమ్మా... అమ్మా కొంచెం సౌండ్ తగ్గించు సీతా !" రాజశేఖర్ సముదాయించబోయాడు. "నలుగురు వింటే నవ్వులపాలై పోతాం సీతా !" వణికి పోతున్నాడు.

"నల్గురు ఇంటరా ! ఇననీ ఇంటేనే నయం. వాళ్ళనే న్యాయం చెప్పమందాం. వాడకట్టోళ్ళను పిలువు బావా ఆఁ... ఆఁ..." సరికొత్త రాగమాలందుకుంది.

తననుతాను తమాయించుకుని ఆలోచనలో పడిపోయింది జానకి.

సీత చెప్పేదంతా నిజమేకావచ్చు. లేకపోతే ఏ ఆడదన్నా సిగ్గు విడిచి పరాయి మొగాడిని తన మొగుడంటుందా, నన్ను కట్టుకోకముందీయనగారి లీలలెన్నున్నాయో ఎవరికెరుక ? నిప్పులేనిదే పొగరాదుగదా ! వాళ్ళిద్దరి మధ్య ఏమీలేకపోతే ఈవిడంత దూరం నుండి పనిగట్టుకుని ఇంత దూరమెందుకొస్తుందీ ?

"ముందీమెను స్నానం చెయ్యమనండి. ఆ తర్వాత మాట్లాడుకుందాం" అంది ఎందుకైనా మంచిదని.

"ఐతే నిన్ను పెండ్లి జేసుకుంది నిజమేనన్నమాటా" సీత ఒళ్ళు విరుచుకుని సూటుకేసందు కుంది. 'ప్చ్... ఏం చేస్తాం ఒక్కాడదానికిద్దరు మొగలుంటే వొప్పుకోరుగానీ ఒక్క మొగానికిద్దరు భార్యలుంటే ఎవ్వలేమనరు ఇది మన ఖర్మ జానకమ్మా..." గొణుగుతూ నొసలు మీద అరచెయ్యి కొట్టుకుంటూ బాత్రూంలో చొరబడింది.

"ఇది కలైతే ఎంతబావుండు" అనుకుని ఒళ్ళు గిల్లుకున్నాడు రాజశేఖర్ ప్చ్... నిజమే, కలకాదు.

జరుగుతున్న దానికి తనో ప్రేక్షకుడైపోవాల్సిందేనా ? తన గాంభీర్యమంతా మేకపోతు గాంభీర్యమేనా ? ఎదుటి మనిషిని ఏడు చెర్ల నీళ్ళు తాగించే తన పట్టుదల ఏమైందీ ? ఊహూ ! ఇది బాగా లేదు. అదెవతో నెత్తినెక్కి కూచుండి తైతక్కలాడ్తోంది. తన కాపురంలో కాకులు గద్దలాడు కుంటాయి. దాన్ని ఇంట్లోంచి తరిమెయ్యాలి. కాని అల్లరి కాకుండా జాగ్రత్తపడాలి. ఎలా... ఎలా... ఎలా రెండు చేతుల్తో జుట్టు పీక్కున్నాడు.

అప్పుడే జానకి బుర్రలో చెలరేగిన తుపాను సర్దుకుంటోంది. అయినా గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదన గొంతులో గురగరలాడ్తూనే ఉంది.

ఏవండీ మన పెళ్ళిరోజు నాటికి మా చెల్లి వస్తానని రాసింది అదింకా రాలేదుగాని ఈ దెయ్యం దిగింది అంతా నా ఖర్మనే..."

"మీ చెల్లెలా ! నీకో చెల్లెలుందా ?" అడిగాడు ఆత్రంగా

"చెల్లెలంటే మా చిన్నమ్మ కూతురు. ఇక్కడ సీటు దొరకలేదని బొంబాయిలో ఎం.బి.ఏ. చదువుతూంది. మన పెళ్ళికి మూడ్రోజుల ముందే వెళ్ళింది. మనమీ ఊరికి రాగానే దానికి ఉత్తరం రాశాను. అదొస్తే మీ బాగోతాన్ని జూసి బెంబేలెత్తిపోయేది"

"ఆమె పేరేమిటో ?"

"సీతా కళ్యాణి "

"ఎప్పుడొస్తానని రాసిందీ ?"

"ఈరోజిక్కడుంటానని రాసింది. ఉత్తరం చదివి ప్రత్యుత్తరం రాసేస్తారా?"

గలగలా నవ్వు వినిపించింది. పోలేరమ్మలా బాత్రూంలోకెళ్ళిన సీత పార్వతిదేవిలా తిరిగొస్తుంది.

"ప్రత్యక్షంగా నేనే వచ్చేస్తే ప్రత్యేకంగా ఉత్తర ప్రత్యుత్తరాలెందుకక్కా ?" నవ్వాపుకోలేక పోతుంది.

మొహానికి పసుపు బదులుగా పౌడరుంది. నుదుటి రూపాయ కాసింతబొట్టు నయాపైస సైజులో మెరుస్తూంది. ముత్యాల ముక్కుపోగు స్థానంలో ఒంటిరాయి ముక్కుపుడక. నవ్వుతూంటే నవరత్నాలు రాల్తున్నట్టుంది.

జానకి నరాల్లో మేలిమి జవసత్వాలు గంతులేసినై. "అరే ఇదేనండి మా చెల్లి సీతాకల్యాణి' ' ఎదురేగి కౌగిట్లో బంధించింది. "ఏమే ముద్దు ఇంతపంజేస్తావా ?"

రాజశేఖర్ కంతా అర్థమైంది.

అమ్మో మా మరదలు పిల్ల సరదాల పందిరే. అయినా ఇంతగడుసు దనమా ? నోరెల్ల బెట్టాడు.

జానకి కళ్ళల్లో ఆనందబాష్పాలు సుడులు తిరిగాయి. "మరీ ఇంత నాటుదనమైతే ఎట్లానే" నెత్తిమీద మొట్టికాయవడ్డించి వచ్చి సోఫాలో కూలబడింది.

అలక పాన్పెక్కిన అపర జానకిలా కనబడింది సీతాకల్యాణికి. మా అక్కాబావలు అపర సీతారాములు అనుకుని తృప్తిగా నవ్వుకుంది.

"మాటిమాటికి బావగారు బెట్టుసరి చేస్తారని రాశావుగదక్కా. మీ వివాహ వార్షికోత్సవ శుభసందర్భంగా బావగారి పెడుసుదనానికి నా గడుసుదనం కానుకతల్లీ " అంటూ జానకి నుదురు ముద్దాడి 'చిమా మంచి అక్కయ్యవు గదూ !" బుగ్గగిల్లింది. రాజశేఖర్ వైపు తిరిగి "ఏం బావా వావివరసలంటారు గదా. వరసతప్పని వావితో మిమ్మల్నో ఆటపట్టించాను. సరిపోయిందా లేక..." ముందుకు రాబోయింది.

"చాల్చాలు... వామ్మో ఈ సిసింద్రీ మరదలుతో నేను వేగలేను బాబూ !"

రాజశేఖర్ నవ్వుతో అక్కాచెల్లెళ్ళు శ్రుతి కలిపారు.

**ఆంధ్రప్రభ , ఆదివారం 'మహిళ' లో - 19-7-1998**